ప్రజాశక్తి 6/3/2017

# సోషల్ మీడియాతో సామాజిక మార్పు

- ఎఫ్ట్రానిక్స్ అధినేత రామకృష్ణ
- యువత సమాజ హితానికి కృషి చేయాలి
- ఎస్ఎంఎస్ ప్రథమ వార్షికోత్సవంలో వక్తలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

సోషల్ మీడియా ప్రభావం యువతపై ఎంతో ఉందని, ఇది సమాజంలో మార్పునకు దోహదపడుతోందని ఎఫ్ట్రానిక్స్ అధినేత దాసరి రామకృష్ణ పేర్కొన్నారు. విజయవాడలోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన సోషల్ మీడియా ఫర్ సొసైటీ (ఎస్ఎంఎస్) ప్రథమ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా ప్రసంగించారు. ప్రస్తుత దిన పత్రికలు, న్యూస్ ఛానళ్ళు ఏదో పార్టీకో, ప్రభుత్వానికో మద్దతు పలుకుతున్నందున వార్తలు సెన్సారైపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారానే నిజమైన సమాచారం కొంత అందుబాటులో ఉంటోందన్నారు. ఎవరైనా తమ భావాలను నిర్భయంగా వ్యక్తం చేసేందుకు సోషల్ మీడియా అసలైన వేదికగా మారిందని తెలిపారు. కాలానుగుణంగా మారాల్సిన అవసరం అందరికీ ఉందన్నారు. కొన్ని సంప్రదాయాల వల్ల సమాజం నష్ట పోతోందన్నారు. దేశంలోని 94 శాతం దంపతులు సుఖ సంతోషాలు లేకుండానే యాంత్రిక జీవితం గడుపుతున్నారని 1985లోనే ఒక మహిళా జడ్జి ఆధారాలతో సహా చెప్పిన మాటలను రామకృష్ణ గుర్తు చేశారు. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు నిజమో అబద్ధమో తెలిపే సాఫ్ట్‌వేర్ కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తోందన్నారు. ఒక మంచి ఉద్దేశంతో ఎస్ఎంఎస్‌ను స్థాపించిన విజయ్ ప్రకాష్‌ను ఆయన అభినందించారు. ఎస్ఎంఎస్‌ను ఉన్నత లక్ష్యంతో స్థాపించామని సంస్థ వ్యవస్థాపకులు గరికపాటి విజయప్రకాష్ పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు సోషల్ మీడియా ద్వారా సమాజ హితం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ప్రజల్ని ఎంతో ప్రభావితం చేస్తోందని ఫ్రీ సాఫ్ట్‌వేర్ మూమెంట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి, డాటా సైంటిస్ట్ ప్రమోద్ పేర్కొన్నారు. బహుళ జాతి కంపెనీలు సోషల్ మీడియా వేదికగా పాల్పడుతున్న అక్రమాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాతో అందరికీ ఉపయోగపడే సమాచారం అందుబాటులోకి వచ్చిందని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె నాగేశ్వరరావు తెలిపారు. ఎస్ఎంఎస్ సంస్థ నిర్వహించిన కోడింగ్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పివి సిద్ధార్థ కాలేజ్ ఐటి ప్రొఫెసర్ బి శ్రీనివాసరావు, ఎస్ఎంఎస్ కార్యదర్శి కె శ్రీనివాసరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న రామకృష్ణ